దెందులూరు నియోజకవర్గం

దెందులూరు - పెదపాడు - పెదవేగి

ముగిసిన ఎంసెట్ పరీక్షలు

దుగ్గిరాల(పెదవేగి), ఏప్రిల్ 24 : ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. దుగ్గిరాలలో ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు ఉదయం 150 మంది, మధ్యాహ్నం 150 మంది హాజరు కావాల్సి ఉండగా, ఉదయం ఇద్దరు, మధ్యాహ్నం ఇద్దరు గైర్హాజరయ్యారయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాలకృష్ణ ప్రసాద్ తెలిపారు. ఐదు రోజుల పాటు, ఉదయం, సాయంత్రం ఎంసెట్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆయన చెప్పారు.

తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి

ఎక్కడా నీటి ఎద్దడి రానీయకండి

పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులకు ఎంపీడీవో ఆదేశం

పెదవేగి, ఏప్రిల్ 24 : వేసవిలో తాగునీటి సరఫరా, సంరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని పెదవేగి ఎంపీడీవో సీహెచ్ ఎస్ భ్రమరాంబ సిబ్బందికి సూచించారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు, గ్రామ కార్యదర్శుల సమావేశంలో ఆమె పలు అంశాలపై సమీక్షించారు. ప్రధానంగా వేసవిలో తాగునీటి సరఫరా విషయంలో అప్రమత్తత అవసరమన్నారు. మండలంలో తాగునీటి వనరులు పూర్తిగా గొట్టపు బావులపైనే ఆధారపడి ఉన్న నేపథ్యంలో ఎక్కడైనా అవి మొరాయించినా, విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు ఏర్పడినా తక్షణం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే తక్షణం సమాచారం అందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు. అలాగే పారిశుధ్య పరిరక్షణను సక్రమంగా నిర్వహించాలని భ్రమరాంబ పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ చలివేంద్రాలను ఏర్పాటు చేసి, సురక్షితైన తాగునీటిని ప్రజలకు అందించాలని ఆమె తెలిపారు. సమావేశంలో పెదవేగి మండల విద్యాశాఖాధికారి సీహెచ్.బుధవాసు, ఈవోపీఆర్డీ ఎం.బలరామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కేవీ.సత్యప్రసాద్, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.హరికృష్ణ, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భ్రమరాంబ

ఉపాధి కూలీల పట్ల నిర్లక్ష్యం తగదు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రవి

విజయరాయి(పెదవేగి), ఏప్రిల్ 24 : జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రవి ఆరోపించారు. మండలంలో విజయరాయి, నడిపల్లి, రాయన్నపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం బృందం బుధవారం పరిశీలించింది. పరిశీలన అనంతరం విజయరాయిలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఉపాధి కూలీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యంపై రవి ఆవేదన వ్యక్తం చేశారు. నడిపల్లిలో 2017లో చేసిన మూడు వారాల కూలి సొమ్ము ఇప్పటికీ కూలీలకు చెల్లించలేదన్నారు. రాయన్నపాలెంలో ఐదు వారాల వేతనం ఇవ్వలేదని, విజయరాయిలో నాలుగు వారాల సొమ్ము చెల్లించలేదని ఆయన పేర్కొన్నారు. కాలే కడుపు నింపుకోవడానికి మండుటెండలో పనిచేసిన కాలానికి వేతనం చెల్లించకపోవడం శోచనీయయని ఆయన అన్నారు. మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు నీడ, వైద్య సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని, ఎండలో పనిచేస్తున్న కూలీలకు మజ్జిగ పంపిణీ అనేది ఎండమావిగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉపాధి కూలీల పట్ల ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్యాన్ని వీడి ఇకనైనా కూలీల సమస్యలను పరిష్కంచాలని ఆయన డిమాండ్ చేశారు. ముందుగా శ్రీలంక మృతులకు సంతాపం తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రౌతు ఎల్లమ్మ, ఉపాధ్యక్షుడు అస్కర్ అప్పలస్వామి, నాయకులు గుంజే దానమ్మ, టి.నాగేశ్వరరావు, చంటి, వెంకటేశ్వరరావు, కృష్ణ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రవి

ఓటరు జాబితాల పరిశీలన

దెందులూరు, ఏప్రిల్ 24 : స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఓటర్ల లిస్టులో ఎలాంటి తప్పులు దొర్లకుండా పూర్తిస్థాయిలో వార్డుల్లో కులాల వారీగా ఓటర్ల లిస్టులను పరిశీలిస్తున్నామని ఎంపీడీవో రామకృష్ణనాయక్ అన్నారు. బుధవారం మండల విస్తరణాధికారి గంగన్న పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలతో ఓటర్ల జాబితాను పరిశీలించే కార్యక్రమాన్ని నిర్వహించారు.

27న చౌడేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

అమ్మపాలెం(పెదవేగి), ఏప్రిల్ 24 : అమ్మపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో చౌడేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించి గురువారం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, అంకురారోహణ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, మండపారాధనలు, మధ్యాహ్నం అగ్నిప్రతిష్ఠాపన, దీక్షా హోమాలు, జలాభిషేకం, జలాధివాసం, క్షీరాధివాసం, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ ఉంటాయని చెప్పారు. 26వ తేదీ శుక్రవారం ఉదయం గణపతి పూజ, గోపూజ, చండీహోమము, ధాన్యాధివాసము, దీక్షా హోమము, రుద్రాభిషేకం, మధ్యాహ్నం మంత్రానుష్ఠానములు ఆవాహనా దేవతా హోమములు, పుష్పాదివాసము, నీరాజన మంత్రపుష్పములు, తీర్థప్రసాద వినియోగం ఉంటాయని సభ్యులు తెలిపారు. 27వ తేదీ ఉదయం గణపతి పూజ, గోపూజ, ఆవాహన దేవతా హోమములు, బీజాన్యాసము, రత్నన్యాసం, మంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన, గో దర్శనము, కుంభ నివేదన, అమ్మవారి దర్శనం, మహా పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థప్రసాద వితరణ చేస్తామని తెలిపారు.

'విద్యుత్ బకాయిలు చెల్లించండి'

పెదపాడు, ఏప్రిల్ 24 : మండలంలో వివిధ గ్రామాల్లో పంచాయతీ ఆధీనంలో నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్‌లకు సంబంధించి విద్యుత్ బకాయిలు ఉన్నాయని, వాటిని సకాలంలో చెల్లించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని పెదపాడు మండల ఎలక్ట్రికల్ ఏఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో కొన్ని పంచాయతీల్లో విద్యుత్ బకాయిలు ఉన్నాయని, ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు అందజేశామని, వీలైనంత త్వరగా బకాయిలను చెల్లించాలని ఆయా పంచాయతీల కార్యదర్శులకు తెలియజేశామని అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా లైన్ల మరమ్మతులు, ముళ్లచెట్లు తొలగింపు పనులు పూర్తి చేశామని ఏఈ రామకృష్ణ తెలిపారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

పెదపాడు, ఏప్రిల్ 24 : మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో 2019-2020 సంవత్సరానికి గాను రూ. 15.67 కోట్లతో 7 లక్షల 77 వేల పనులను చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పని కోరిన ప్రతీ ఒక్కరికి 100 రోజుల పని కల్పించే లక్ష్యంగా పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లుగా సిబ్బంది తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీల సంరక్షణ కోసం చర్యలు చేపట్టామని తెలిపారు.

కేంద్రంలో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సిబ్బంది

సామూహిక అన్నప్రాసన

దెందులూరు, ఏప్రిల్ 24 : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చల్లచింతలపూడి అంగన్‌వాడీ టీచర్ రొక్కం జయరత్నకుమారి కోరారు. బుధవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా టీచర్ జయరత్నకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పాలు, గుడ్డుతోపాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని, కుల, మత, వర్గాలకు అతీతంగా అంగన్‌వాడీ కేంద్రంలోనే గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు చేస్తూ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

దివ్యాంగులతో దాతలు

దివ్యాంగులకు దుస్తులు పంపిణీ

అప్పనవీడు (పెదపాడు), ఏప్రిల్ 24 : అప్పనవీడులోని ఆశాజ్యోతి మానసిక వికలాంగుల ఆశ్రమంలో దివ్యాంగులకు రోషిణి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అనంతరం వారికి భోజనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రోషిణి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఆరాఫత్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్థ ద్వారా సేవ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు, పేద వృద్ధులకు సంస్థ తరపున తోడ్పాటునందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. లోపాన్ని శాపంగా భావించక ఆత్మస్థైర్యంతో ముందుకు సాగేందుకు నిరంతరం శ్రమించాలని, ఇందుకు నిర్వాహకులు కృషితో పాటుగా దాతల సహకారం అవసరమని అన్నారు. ఆశాజ్యోతి అధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

బడి బయట పిల్లల నమోదు

దెందులూరు, ఏప్రిల్ 24 : బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు మండలంలో ఉపాధ్యాయులు, వాలంటీర్ల బృందం బుధవారం పర్యటించింది. దెందులూరు, గోపన్నపాలెం, కొవ్వలి, అప్పారావుపాలెం గ్రామాల్లో వాలంటీర్లు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేసి పాఠశాల తెరిచే సమయానికి వారంతా వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు

దెందులూరు, ఏప్రిల్ 24 : మండలంలోని అన్ని పంచాయతీల్లో తాగునీటి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో చెరువులు, ట్యాంకులను నింపుతూ సమస్య ఏదైనా ఉంటే తమకు నేరుగా తెలియజేయాలని ఎంపీడీవో రామకృష్ణనాయక్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆయన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యేకాధికారులు, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్ద సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అశ్రద్ధ చేయొద్దని అన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, అంగన్‌వాడీలను సమన్వయం చేసుకుని గ్రామాల్లో వడదెబ్బ తగలకుండా ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడంతోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జరిమానా

పెదపాడు, ఏప్రిల్ 24 : మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న పలువురికి జరిమానాలను విధించామని పెదపాడు ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతీ వాహన దారుడు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సురక్షిత ప్రయాణానికి అది ఎంతగానో దోహదపడు తుందని అన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడపడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీని వల్ల కొన్నిసార్లు ప్రాణానికి హాని జరుగుతుందన్నారు. అతి వేగంగా వాహనాన్ని నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా వాహనాలను నిలుపుదల చేయడం చేయరాదన్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసు సిబ్బందికి తగు విధంగా సహకరించాలని సూచించారు. జరిమానాలను దగ్గరలోని మీ సేవా కేంద్రంలో చెల్లించాలన్నారు.